

# తక్కిన ఇద్దరు

కప్పగంతుల సత్యనారాయణ

నరసింహారావు ఆ ఆఫీసులోచేరి రెండు సంవత్సరాలయింది. అతి కష్టంమీద ఆ వుద్యోగం సంపాదించాడు. ఎన్నో ఆఫీసులు తిరిగి, ఎంతోమందిని దర్శించి, నానా అవస్థలూ పడితేనేగాని ఆ వుద్యోగం దొరకలేదు బి.యే. ప్యాస యినా, తనకన్న తక్కువ చదువుకున్న వాళ్లు ఎక్కువ జీతం సంపాదించు కుంటూ వున్నా, చాలాకాలం వుద్యోగం లేకుండా అవస్థపడి వుండటంచేత, ఏదో ఒక వుద్యోగంలో, ఎంతో కొంత జీతంమీద చేరితేనేకాని లాభంలేదనీ, ఒకసారి యెక్కడో ఒకచోట చేరితే, తరువాత క్రమంగా పైకి పోవచ్చుననీ, అతను ముప్పయి రూపాయిల జీతానికే- పాపం ఆ వుద్యోగంలో చేరాడు.

ఆ ఆఫీసులో చేరేటప్పటికి, అంతకు పూర్వమే అయిదుగురు గుమాస్తాలు వున్నారు. నరసింహారావు ఆరోవాడు. ఇతను చేరిన తరువాత, యీ రెండేళ్ళ లోనూ ఇద్దరు గుమాస్తాల్సు అక్కడ పని మానుకొని, ఎక్కువ జీతాలమీద ఇంకెక్కడో చేరారు. ఆ ఇద్దరూ పని మానుకున్నప్పుడు, నరసింహారావు తన యజమాని దగ్గరకు వెళ్ళి తనకు కొద్దిగా నైనా, జీతం ఎక్కువ చెయ్యమని అర్థించాడు, కాని, ఆ కొరకరాని కొయ్య యజమాని దగ్గర అదేమీ లాభించలేదు.

నరసింహారావు చేస్తున్న పనికి తాను ఇచ్చే జీతమే చాలా ఎక్కువన్నట్లు మాట్లాడాడు ఆ యజమాని.

నరసింహారావుమాత్రం, యీ అభిప్రాయంతో ఎంతమాత్రమూ ఏకీభవించకపోయినా, ప్రస్తుతం ఆ వుద్యోగం వదిలిపెట్టివేస్తే, తాను చేతిలో వుద్యోగం ఏమీలేక అవస్థపడవలసి వస్తుందని, కిక్కురుమనకుండా వూరుకున్నాడు.

బియ్యం ధర పెరిగింది నెయ్యిధర హెచ్చింది. గుడ్డల ఖరీదు ఒకటికి నాలుగు రెట్లయింది. ఇంటి యజమాని ఇంకొక నాలుగు రూపాయలు ఎక్కువ ఇస్తే సరి, లేకపోతే ఇల్లు ఖాళీచెయ్య

మన్నాడు. నరసింహారావు జీతంమాత్రం ఎదుగూ, బొదుగూ లేకుండా అలాగే వుంది. పగలు ఆఫీసులో పనిజేస్తూ వున్నంతసేపూ, చాలా తక్కువ జీతానికి, విపరీతంగా ఎక్కువ చాకిరీ చేస్తున్నానే అనే రోషంతోనూ, ఇంట్లో వున్న కాస్సేపూ, ఇంటిఖర్చుకు సరిపోయే మాత్రమేనా సంపాదించలేక పోతున్నానే అనే బెంగతోనూ నరసింహారావు తపనపడిపోతున్నాడు.

నరసింహారావు భార్య చాలా మర్యాద తెలిసిన మనిషి కనక, తనచేతనైనంత వరకు మగని మనస్సుకు కష్టం కలిగించకుండానే సంసారం గడపడానికి ప్రయత్నిస్తోంది. కాని అది ఒకమాత్రాన సాధ్యమా. యాభైరూపాయల ఖర్చు యాభైరూపాయలే. ముప్పయిరూపాయిల సంపాదన ముప్పయిరూపాయిలే

ఈసారి ఎలాగయినాసరే యజమానితో మాట్లాడి జీతం యెక్కువ చేయించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

యజమాని దగ్గరకు వెళ్ళాడు. కొంచెంసేపు నిలుచున్నాక, "ఏమిటి ?" అని అడిగాడు యజమాని.

కొంచెం తడబడి మెల్లిగా గొంతు సవరించుకొని "వస్తువులఖరీదులన్నీ చాలా పెరిగిపోయాయండి" అన్నాడు.

ఆ యజమాని, దేవాంతకుడు. నరసింహారావు ఏమి అడగదలచుకున్నాడో గ్రహించి, ముందరి కాళ్ళకి బంధంగా "అవును, చాలా పెరిగిపోయాయి. ఆఫీసు ఖర్చులు కొంత తగ్గించుకోవాలని ఆలోచిస్తున్నాను. ఏమీ పాలుపోవటంలేదు" అన్నాడు.

నరసింహారావుకి, గొంతులో ఏదో అడ్డంపడినట్లయింది—కాని గొంతు సవరించుకొని, మరి కొంచెం ధైర్యం తెచ్చుకొని "నాకు జీతం బొత్తిగా చాలటంలేదండి. ఇంక్రిమెంటు ఏమైనా ఇస్తేగాని, బొత్తిగా గడిచేటట్టులేదు. మీ ఆఫీసులో చేరి రెండేళ్లయింది పైగా, నేను చాలా కష్టపడుతున్నాను కూడాను. ముగ్గురు మనుష్యుల పని నేను ఒక్కణ్ణిని'' అని అన్నాడు, నరసింహారావు మొహం చూస్తూ.

"నరసింహారావు, ఆఫీసు ఖర్చు చాలా ఎక్కువ అయిందని ఇప్పుడే కదా, నీకు చెప్పాను. నువ్వు ఒక్కడివీ ముగ్గురు గుమాస్తాల పని చేస్తున్నానంటున్నావ్. ఆ తక్కిన ఇద్దరూ ఎవరో చెప్పు-వాళ్ళని తీసిపారేస్తాను. ఆఫీసు ఖర్చు కొంతేనా తగ్గుతుంది" అన్నాడు యజమాని.

నరసింహారావు నోట మాటలేక అలాగే నిలుచున్నాడు.